

కళాకారుడు సన్యాసిరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రముఖ జానపద కళాకారుడు కింతాడ సన్యాసిరావు మృతికి శుక్రవారం ప్రజానాట్యమండలి, భజన కళాకారులు సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల పాటు రాష్ట్రవ్యాప్తంగా జానపద కళారూపాల ప్రదర్శనల ద్వారా సన్యాసిరావు పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు. బుర్రకథ కళాకారుడిగా, రంగస్థల నటుడిగా, తప్పెటగుళ్ల కళాకారునిగా, భజన కళాకారునిగా, గురువుగా, రచయితగా కళాకారుల్లో మంచి గుర్తింపు పొందారున్నారు. ఆయన మృతి కళా రంగానికి తీరని లోటన్నారు. పొలమరశెట్టి సత్తిబాబు, కుంచే అచ్చారావు, నీలం శ్రీను, కంపర వీరబాబు, గడపా శివ, వాసు, దారపురెడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, దారపు రెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, బంగారు రాజు సంతాపం తెలిపారు.

జనసేన కమిటీలపై గందరగోళం

- వార్డు, బూత్, స్థాయి కమిటీలు
- పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురం నుంచి ప్రారంభం
- దూరంగా స్థానిక, జిల్లా నాయకత్వం
- ప్రాధాన్యత దక్కడం లేదని కార్యకర్తల గగ్గోలు
- ఫైవ్ మెన్ కమిటీని పక్కన పెట్టిన వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చేలా, వారి నుంచి నాయకత్వ లక్షణాలను బయటకు తీసుకురావాలని జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎంఎల్ఎ పవన్ కల్యాణ్ సూచనలతో మూడు రోజులుగా నియోజకవర్గంలో కమిటీల నియామకం చేపట్టారు. నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు పార్టీ కార్యాలయంలో జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా ప్రక్రియ పూర్తి గందరగోళం నడుమ సాగుతోందని పలువురు జనసైనికులు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామంటూ నిర్వాహకులు చెబుతున్నప్పటికీ ఆచరణలో అందుకు భిన్నంగా కమిటీల ఏర్పాటు అవుతున్నాయన్నట్లుగా ఆరోపిస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా...

పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచే క్షేత్రస్థాయి పార్టీ కమిటీల నియామకాన్ని ప్రారంభిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఇక్కడి నుంచే కమిటీల నియామకం పూర్తయిన తర్వాత రాష్ట్రంలోని మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ప్రారంభిస్తామని పార్టీ నేతలు తెలిపారు. వార్డు, బూత్, గ్రామ స్థాయి కమిటీల నియమకంలో భాగంగా ప్రతీ వార్డు నుండి 10 నుండి 15 మంది సభ్యులతో వార్డు ఇన్‌ఛార్జి ఎన్నిక, ఇదే తరహాలో బూత్, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు అవుతున్నాయి. పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న జనసైనికులకు, వీర మహిళలకు గుర్తింపు ఇచ్చేలా జరుపుతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేశారు.మరో వారం రోజులు లోపే కమిటీల నియామకం పూర్తి కానుంది.

అంతా సెంట్రల్ టీము కనుసన్నలలోనే..

పిఠాపురం నియోజకవర్గంలో కమిటీల నియామక ప్రక్రియలో స్థానిక నాయకత్వానికి ఎటువంటి చోటూ కల్పించడం లేదు. కొద్దిరోజుల క్రితం నియమించిన ఫైవ్ మ్యాన్ కమిటీ కూడా ఈ కమిటీల నియామక వ్యవహారంలో దూరంగా ఉంది. అంతా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ ఆధ్వర్యంలో సెంట్రల్ టీం సభ్యులు నిర్వహిస్తున్నారు. దీంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నాయకత్వానికి అవకాశం ఇవ్వకుండా గ్రామ, వార్డు, బూతు స్థాయి కమిటీల నియామకం జరిగిపోతోందంటూ పెద్ద ఎత్తున విమర్శలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తుండడం విశేషం. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న జనసైనికులకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి అంటూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని సమాచారం. ఆది నుంచి కష్టపడి పార్టీ జెండాని భుజాన మోస్తున్న వారికి ప్రాధాన్యత దక్కడం లేదని పలువురు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తర్వాత పార్టీలోకి వచ్చిన వారికి కమిటీలలో చోటు దక్కడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో పార్టీ రెండు మూడు వర్గాలుగా విడిపోతున్న పరిస్థితి ఏర్పడింది.

పారదర్శకత లోపించిందా...?

ఆయా గ్రామానికి చెందిన జన సైనికుల చేతనే తొలిసారిగా పార్టీ కమిటీల ఎంపిక ఓటింగ్ విధానం ద్వారా జరుపుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. తొలుత గ్రామాలకు, తర్వాత వార్డులకు, బూత్‌లకు ఇన్‌ఛార్జిలను నియమిస్తున్నారు. గ్రామంలో ఆది నుంచి జెండా మోస్తున్నప్పటికీ మధ్యలో పార్టీలోకి వచ్చినవారికి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు జనసైనికులు ఆరోపిస్తున్నారు. పిఠాపురం మండలం జల్లూరులో ఒక వర్గానికి ప్రాధాన్యత ఇస్తే మరో వర్గాన్ని పూర్తిగా విస్మరించారని అక్కడ సైనికుల నుంచి విమర్శలు వచ్చాయి. కార్యకర్తలను ఎక్కువ మందిని తీసుకెళ్లి ఓటింగ్ విధానంలో పాల్గొన్న వారికే పదవులను అప్పగిస్తున్నారని దీంతో ఆది నుంచీ పార్టీలో సేవలందిస్తున్న తమ వంటి వారికి అవకాశం దక్కడం లేదని పలువురు కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో రెండు రోజుల క్రితం ఇక్కడ ఏకపక్షంగా కమిటీల నియామకం జరగ్గా మరుసటి రోజు మరో వర్గం సుమారు 300 మంది పార్టీ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. దీంతో రామ్ తాళ్లూరి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినిపించుకోలేదు. చివరికి మండల కమిటీలో అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు వెనక్కి తగ్గారు. ఇలా పలు గ్రామాలకు చెందిన అనేకమంది పార్టీ కోసం కష్టపడుతున్న తమకు కమిటీలలో ప్రాధాన్యత దక్కక తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారని, భారీ సంఖ్యలో కార్యకర్తలను తరలించడం తమకు తలకు మించిన భారంగా మారుతోంది అంటూ పలువురు భహిరంగంగా ఆవేదన చెందుతున్నారు. పెద్ద సంఖ్యలో తరలిస్తున్న కొందరు గ్రామ ఇన్‌ఛార్జి పదవి కోసం కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్న విమర్శలు సైతం వచ్చిపడుతున్నాయి. ఇలా పలు గ్రామాల్లో కమిటీల ఎన్నిక ఏకపక్షంగా జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. మిత్రపక్షానికి చెందిన పలువురు స్థానిక ఎన్నికలలో రెబెల్‌గా పోటీ చేసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అన్ని వర్గాలను కలుపుకుని కమిటీల నియామకం జరిగితే బాగుంటుందని పలువురు కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌తో నూతనంగా ఎన్నికైన ఒక గ్రామ కమిటీ సభ్యులు

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గండేపల్లి

21న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వైద్యాధికారి నరేష్ సూచించారు. శుక్రవారం పిహెచ్‌సిలో సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు పోలియో చుక్కలు వేయించుకున్న వారు ఈ అదనపు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని తెలిపారు, 22, 23 తేదీల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు గృహ దర్శనాలు చేసి మిగిలిన అందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలో 2,500 మందికి 26 పోలియో బూతుల్ ద్వారా పోలియో చుక్కలు వేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -తాళ్లరేవు

మండలంలోని పలు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.2.73 కోట్లతో నిర్మించిన పనులను కలెక్టర్ షాన్‌మోహన్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, తాళ్లరేవు ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. పటవల అండ్ బి రోడ్డు నుంచి శాంతిమూల గ్రామం వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. మట్లపాలెంలో నిర్మించిన ఫిష్ లాండింగ్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. మట్లపాలెం మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఎన్‌హెచ్ 216 నుంచి మార్కెట్‌కు వచ్చేందుకు వీలుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని మత్స్యకార నాయకులు కె.మాతరాజు, బొడ్డు సత్యనారాయణ, బలసాడి రంగారావు కోరారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావును ప్రజలు ఘనంగా సత్కరించారు. ఎఫ్‌డిఒ అనురాధ, డిఈ శ్రీనివాస్, ఎఇ అప్పారావు, టిడిపి కూటమి నాయకులు ధూళిపూడి బాబీ, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, భజన సత్తిబాబు, కొత్తూరు కాశి ఈశ్వరుడు, శ్రీహరి రాజు, జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, కనకాల సిద్ధిశేషారావు, అల్లూరి రామకృష్ణంరాజు, కామాడి మాతరాజు, మోపూరి వెంకటేశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వర రావు, మోకా కస్తూరి, వాసంశెట్టి గోవిందు, దంగేటి అన్వేష్, కొప్పిశెట్టి బాబి, వాసంశెట్టి శ్రీనివాస్, పిన పోతు వీరబాబు, పినపోతు రాజు పాల్గొన్నారు.



మట్లపాలెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జగన్నాథపురంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇళ్ల స్థలాలు గృహ నిర్మాణ అనుమతులు, కొత్త పెన్షన్లు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు రావడంతో, వెంటనే రెవెన్యూ అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇవ్వగా, ఎక్కువశాతం సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజా సమస్యలను సాంకేతిక, ఆర్థికపరంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు పని చేస్తానని ప్రజలకు కొండబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న ఎంఎల్ఎ కొండబాబు



చర్చలు జరుపుతున్న అధికారులు

గొల్లప్రోలు వివాదంపై అధికారుల చర్చలు

ప్రజాశక్తి-కాకినాడ


పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు కొత్తపేటలో క్రైస్తవ ప్రార్థనా మందిరంపై ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, కాకినాడ ఎస్‌డిపిఒ మనీష్ పాటిల్ రెండు గ్రూపులతో విడివిడిగా చర్చలు జరిపారు. పది రోజుల కిందట క్రైస్తవ సంఘాలలో ప్రార్థన జరుగుతుండగా కొంతమంది స్థానికులతో పాటు విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు క్రైస్తవుల ప్రార్థలను అడ్డుకున్న నేపథ్యంలో ఈ చర్చలు నిర్వహించారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడు సాయికి అభినందన

ప్రజాశక్తి-తాళ్లరేవు

టిడిపి అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన గుత్తుల సాయికి మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు శుక్రవారం అభినందనలు తెలిపారు. సాయి నివాసానికి ఆయనను ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో దడాల బుజ్జి బాబు, కాలా సూరిబాబు ఉన్నారు.

కార్టూ'నిజం'



ఉపాధి హామీ చట్టం రద్దుపై నిరసన

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సవరణలు రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సీనియర్ నేత దువ్వ శేష బాబ్జి మాట్లాడారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు సిహెచ్.రమణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, డి.ప్రసాద్, నాగాబత్తుల సూర్యనారాయణ, కె.నాగజ్యోతి, సూరిబాబు, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, జి.భూలక్ష్మి, కె.వీరబాబు, వి.చంద్రరావు, యు.సత్యనారాయణ, ఎం.హరనాథ్, వెంకట్రావు, లోవరాజు, జైరాం, సతీష్, వరహాలు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ ఇంద్రపాలెం ఎన్టీర్ పార్కులో గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణారావు, చిట్టూరి విజయ్‌కుమార్, తొట్టిపూడి రాజా, వాసంశెట్టి చంద్రరావు, నాగదేవి, చింతపల్లి రమణ, మధు కిరణ్, సూర్యం పాల్గొన్నారు. తూరంగి డ్రైవర్స్ కాలనీ రోడ్డులో ధర్నా చేశారు. పార్టీ నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, సిఐటియు కాకినాడ రూరల్ కార్యదర్శి టి.రాజా మాట్లాడారు. సిహెచ్.భవాని, పి.మంగ, ఎ.సత్య కుమారి, పితాని లక్ష్మి, ఎం.శంకరమ్మ, గోవిందమ్మ, కె.వెంకటలక్ష్మి, ఐ.దుర్గ, పలివెల సుభద్ర, కె.బేబీ, ఎం.సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సిపిఎం మండల కన్వీనర్ గుర్రాల అప్పారెడ్డి మాట్లాడారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందించారు. కె.నాగేశ్వరరావు, జి.వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, రాముడు సతీష్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరప మండలం పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి గ్రామాల్లో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ ఉపాధి కూలీలతో మాట్లాడారు. కష్ణ, మధుర చంద్రరావు, సత్యనారాయణ, ఎర్ర సత్తిరాజు, నాగేశ్వరావు, సత్య పాల్గొన్నారు.

తాళ్లరేవు గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.



కాకినాడలో ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు



కాకినాడ రూరల్‌లో ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు



యు.కొత్తపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

బాల్య వివాహ రహితమే లక్ష్యం

ప్రజాశక్తి - కిర్లంపూడి, పెద్దాపురం

బాల్య వివాహ రహిత దేశమే లక్ష్యమని ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఒ పూర్ణిమ, లీగల్ అడ్వకేట్ మధుబాబు, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కిర్లంపూడి మండలం బురుగుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో బాల్ వివాహ్ ముక్త్ భారత్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ 100 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమములో హెచ్‌ఎం మాధవి, కౌన్సెలర్ దుర్గారాణి, సూపరవైజర్ కరీమున్నీసా, మడికి రాంబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవం జెడ్‌పి హైస్కూల్లో బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం సిహెచ్‌వి.రమణ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, లీగల్ వాలంటీర్ కెవి.లక్ష్మి, బి.లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి శైలజ, ఎఎన్‌ఎం ఎం.భారతి, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రెటరీ జె.సత్య అనిల్ కుమార్ పాల్గొన్నారు.



కిర్లంపూడిలో అవగాహన కల్పిస్తున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్



పెద్దాపురంలో అవగాహన కల్పిస్తున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి- సామర్లకోట

ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని నేరుగా పరిష్కరించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. జి.మేడపాడులో ఆయన ప్రజాదర్బార్‌లో శుక్రవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన అన్ని దరఖాస్తులనూ సంబంధిత శాఖల ద్వారా వీలైనంత త్వరగా పరిశీలించి తగిన పరిష్కారాలు అందిస్తామని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీనుబాబు, కుమారస్వామి, నూనె రామారావు, ముసిరెడ్డి శ్రీరాములు, మొయిళ్ల కృష్ణమూర్తి, తోటకూర శ్రీనివాసు, శ్రీకాంత్, సుధాకర్, రవి, తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఒ కాదా హిమ మహేశ్వరి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు

ప్రజాశక్తి-కాకినాడ

పండుగల వేళ సైబర్ నేరగాళ్లు పంపించే ఫ్రీ గిఫ్ట్, అదనపు జిబి, లైక్ చేస్తే డబ్బులు, ఇంట్లో కూర్చుని డబ్బులు అంటూ చేసే మోసాల బారిన పడవద్దని ఎస్‌పి జి.బిందుమాధవ్ ప్రజలకు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో విపరీతమైన విక్రయాలు ప్రారంభం అవుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాల లింక్‌లు వస్తుంటాయని, ఆ లింక్‌లను క్లిక్ చేసి మోసపోవద్దన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో ఎక్కడా లేదని, అది ఒక మోసగాళ్ల కుట్ర అని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చిన లింకులు, ఎపికె ఫైల్ క్లిక్ చేయవద్దని,వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్‌లలో పంచుకోవద్దన్నారు. మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని ఆయన హెచ్చరించారు. ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు, కాల్ చెయ్యాలని, లేదా www.cyber-crime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

కాలువల పూడిక తీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కరప

గొడ్డటిపాలెంలో సాగు నీటి సమస్య లేకుండా ఎంఎల్ఎ పంతం నానాజీ ఆదేశాలతో కాలువల పూడిక తీత పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ గోన అనూష ఆంజనేయులు తెలిపారు. రైతుల విన్నపం మేరకు శుక్రవారం మొదలుపెట్టిన పనులను గ్రామ సర్పంచ్ పర్యవేక్షించారు. ఈ పనుల్లో అక్కిరేవు నుంచి జెడ్.భావారం, కొరిపల్లి వరకూ పూడికలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు నక్క బ్రహ్మాజీ, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

స్వయం ఆర్థిక అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఓన్ సోర్స్ రెవెన్యూ (ఒఆర్ఎస్) పంచాయతీలు అనే అంశంపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ హాల్లో ఎంపిడిఒ సూర్యనారాయణ అధ్యక్షతన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎపిఎస్ఐఆర్‌డి నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, ఎస్‌డబ్ల్యు అధికారి వై.శ్రీహరి అవగాహన కల్పించారు. ప్రతి గ్రామపంచాయతీ స్వయం ఆర్థిక అభివృద్ధి సాధించడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో వాలుతిమ్మాపురం పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేష్, సిబ్బంది పి.వీర మణికంఠ, ఎన్.ఐశ్వర్య, విఆర్ఒ కొక్కిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అందరికీ సామాజిక బాధ్యత అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

సామాజిక బాధ్యతతో వ్యవహరించిన మండలంలోని మల్లిశాల గ్రామానికి చెందిన వ్యక్తిని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అభినందించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని విద్యుత్ లోవోల్టేజ్ సమస్య, విద్యుత్ వైర్ల సమస్యలను పరిష్కరించాలని వినతులు అందజేశారు. మల్లిశాలలో కోడి పందేలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆయనను ఎంఎల్ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ అడపా భరత్, ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఎస్‌విఎస్ అప్పలరాజు, టిడిపి నాయకులు జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాంద్రంకి రాంబాబు, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, తహశీల్దార్ జెవిఆర్.రమేష్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

నేరాలు ఘోరాలు



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన యువకులు

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న అతి వేగం
మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మితిమీరిన వేగం యువకుల ప్రాణాలను బలిగొంది. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాలివి. యానాం నుంచి కాకినాడ వైపు ముగ్గురు యువకులు బైకుపై వేగంగా వెళుతూ ముందు ఉన్న వాహనాన్ని ఓవర్టేక్ చేసి, కాకినాడ నుంచి బైకుపై వస్తున్న యువకుని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో యానాంలో నివాసముంటున్న ఐ.పోలవరం మండలం పాత ఇంజరం గ్రామానికి చెందిన కొండ్రు వినయ్ కుమార్(23) అక్కడికక్కడే మరణించాడు. ధవళేశ్వరం వేమగిరి వాడపేటకు చెందిన కందు సతీష్ (23)ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. ధవళేశ్వరానికి చెందిన కొమర లక్ష్మీ నిలేఖర్, కాకినాడకు చెందిన సూరాడ అనిల్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక లారీలు

మూడు ఇసుక లారీల సీజ్

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి, పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను జిల్లా సాండ్ టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్ఐ కె.ఆంజనేయులు ఈ వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం ప్రక్కిలంక ఇసుక ర్యాంపు నుంచి మూడు ఇసుకలారీలు బయలుదేరాయి. టాస్క్ ఫోర్స్ అధికారులు బొబ్బిల్లంక వద్ద వాటిని అడ్డుకున్నారు. ఈ లారీల్లో సుమారు 60 టన్నుల కంటే ఎక్కువ ఇసుక ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల మేరకు వాటిని స్వాధీనం చేసుకుని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ సామర్ధ్యాన్ని బట్టి నిర్దేశించిన పరిమితిలోనే లోడు వేసుకోవాలన్నారు. అధిక లోడు వల్ల రహదారులు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలకు అవకాశం ఉంటుందన్నారు.

చోరీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

ప్రజాశక్తి-గండేపల్లి

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసుల్లో ముద్దాయిలకు కోర్టు 15 నెలల జైలు శిక్ష విధించినట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ శివనాగు తెలిపారు. మండలంలో బొర్రంపాలెం, గండేపల్లి, మురారి గ్రామాల్లో వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్స్ పగలగొట్టి కాపర్ వైర్ చోరీ చేసిన కేసుల్లో విజయనగరం జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారని తెలిపారు. వీరికి ఒక్కొక్క కేసులో పెద్దాపురం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎల్.దేవి రత్నకుమారి 15 నెలల చొప్పున జైల శిక్ష విధించినట్టు తెలిపారు.



గోదావరి కాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

గుర్రపుడెక్క తొలగిస్తూ కార్మికుడు గల్లంతు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయం ఆర్చి గేటు సమీపంలోని గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగిస్తూ శుక్రవారం సామర్లకోట యానాదుల కాలనీకి చెందిన చేవూరి లోవరాజు గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి కాలువలో జలాల ప్రవాహం ఉధృతిగా ఉండగా ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టారు. కార్మికులకు భద్రతా ఏర్పాట్లు చేపట్టకుండా గుర్రపు డెక్క తొలగింపు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి, గ్రామ పెద్దలు, చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇఒ మాట్లాడుతూ ఆలయ ముఖ మండపం, ప్రాకారాలు, గాలిగోపురాలకు సంబంధించిన నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు పూర్తి స్థాయిలో తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వీరి అప్పారావు, గ్రామ పెద్దలు గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, పెద్దింటి కాశి, వైట్ల గంగరాజు, దొమ్మేటి రామకృష్ణ, దాసరి శ్రీను, చనుమోలు గణేష్, పెద్దింటి రాంబాబు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఆదిత్య సిబ్బంది

ఆదిత్య విద్యార్థుల పతకాల పంట

ప్రజాశక్తి-గండేపల్లి

బొమ్మూరులో ఈ నెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025లో ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు 10 బంగారు, 6 రజతం, 6 కాంస్య పతకాలు సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జి.అవినాష్‌కు అథ్లెటిక్స్ విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్, పురుషుల విభాగంలో ఆదిత్య పాలిటెక్నిక్‌కు అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని తెలిపారు. పీడీలు చిట్టూరి మురళీమోహన్, కె.శేఖర్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్, డీన్ ఎవి.మాధవరావు, అసోసియేట్ డీన్ పొన్నాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిత్యలో ముగిసిన జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో నేషనల్ లెవెల్ వర్క్ షాప్ విజయవంతంగా నిర్వహించినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోనివైఎంసి లాబ్స్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డాక్టర్ డి.సతీష్ కుమార్ పాల్గొన్నారు. మొదటి రోజు వైఎంసి లాబ్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ కె.జనార్దన్ రెడ్డి పలు అంశాలపై సమగ్రంగా వివరించారు, హెచ్‌పిఎల్‌సి ఎక్విప్‌మెంట్స్, సాఫ్ట్‌వేర్‌పై హ్యాండ్ ఆన్ ప్రోగ్రాం నిర్వహించారు. రెండో రోజు ఫ్లాష్ క్రోమోటోగ్రఫీ గురించి వివరించి హాండ్స్ ఆన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల మధ్య అకడమిక్ పరస్పర చర్య పెంపొందించబడినదే కాక ఫార్మసీ విద్యలో నూతన ధోరణులు, ఆధునిక విధానాలపై అవగాహన కల్పించడంలో ఈ వర్క్ షాప్ ముఖ్యమైన పాత్ర పోషించిందని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు..



సీ పోర్ట్ పర్యటనలో హార్వెస్ట్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హార్వెస్ట్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక హార్వెస్ట్ ది కాన్సెప్ట్ స్కూల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను శుక్రవారం కాకినాడ సీపోర్టు క్షేత్ర పర్యటనకు తీసుకునివెళ్లినట్టు కరస్పాండెంట్లు సత్యానందరెడ్డి, సత్య మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీల్డ్ ట్రిప్పులో వివిధ రకాలైన యంత్రాలు వాటి పనితీరు, ఓడల ద్వారా ఎగుమతులు, దిగుమతులు, సీ పోర్ట్ చరిత్ర మొదలైన అంశాలను పరిశీలించి అవగాహన చేసుకున్నారన్నారు. అనంతరం కుడా ఎయిర్‌పోర్ట్ మ్యూజియంను సందర్శించారన్నారు. ఈ క్షేత్ర పర్యటన విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిల్‌రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంఎల్ఎ చినరాజప్ప

మంత్రి లోకేష్‌ను కలిసిన చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌కు ఎంఎల్ఎ చినరాజప్ప స్వాగతం పలికారు. లోకేష్ జిల్లా పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్ట్‌కు శుక్రవారం చేరుకున్నారు. మంత్రి లోకేష్‌కు స్వాగతం పలకడానికి ఎంఎల్ఎ చినరాజప్ప ఆయన తనయుడు నిమ్మకాయల రంగనాగ్‌తో కలిసి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లారు. ఎంఎల్ఎ వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మండల టిడిపి అధ్యక్షుడు మునిరెడ్డి శ్రీరాములు తదితరులు ఉన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ కెవివి.సత్యనారాయణ కోరారు. ఉప్పాడ, కొత్తపల్లిలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆయన శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో కన్వీనర్ కె.నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మొగలి సూరిబాబు, సిహెచ్.సాంబశివ కుమార్, ఆకుల శివ, గౌరీ, గంగాధర్, విజయ్, సూరిబాబు, వాసు పాల్గొన్నారు.

రోడ్డుపై భవన నిర్మాణ వ్యర్థాలు వేయొద్దు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలో భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ నగర ప్రజలకు సూచించారు. శుక్రవారం నగరంలో సుబ్బయ్య హోటల్ ప్రాంతం, రామారావుపేట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అక్కడ పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. పర్యటన సందర్భంగా రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలను గమనించినకమిషనర్, సంబంధిత భవన యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఎంత శుభ్రం చేసినప్పటికీ, నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేయడం వల్ల రహదారులు మళ్లీ వ్యర్థాలతో నిండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నట్లయితే సచివాలయ సిబ్బందికి సమాచారం అందిస్తే, నగరపాలక సంస్థ సిబ్బంది వచ్చి వాటిని తొలగిస్తారని తెలిపారు. ఆయన వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, వాటర్ వర్క్స్ డిఇ లక్ష్మీనారాయణ, ఎసిపి శ్రీధర్, ఇఇ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు పాల్గొన్నారు.

ఈగల్ క్లబ్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం, మామిడాడ జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు ఈగల్ క్లబ్‌పై సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ శుక్రవారం అవగాహన కలిగించారు. విద్యార్థులతో ఈగల్ కమిటీని ఏర్పాటు చేసి దుకాణాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తే తమకు తెలియజేయాలన్నారు. తోటి విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, ఈవ్ టీజింగ్, యాంటీ ర్యాగింగ్ వంటి వాటి జోలికి పోవద్దని సూచించారు. అనంతరం పాఠశాలకు 100 గజాల దూరంలో ఉన్న షాపులను తనిఖీ చేసి సిగరెట్, పొగాకు ఉత్పత్తులు, గంజాయి, పాన్ పరాగ్ వంటి మత్తు పదార్థాలను అమ్మకూడదని దుకాణదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ శేఖర్, కానిస్టేబుల్ దుర్గా ప్రసాద్, రామవరం, మామిడాడ హెచ్‌ఎం నాగరాజు, బి.ఎ.పద్మలత పాల్గొన్నారు.

నేడు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో గ్రేడ్ ఒకటి నుంచి ఐదు వరకూ ఉన్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ రెవిన్యూ, సర్వేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీ రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామపంచాయతీ అడ్మినిస్ట్రేషన్ ట్రైనింగ్, స్ట్రాటజీస్, నైపుణ్యం తదితర అంశాలపై శనివారం 9:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



పతకాలు సాధించిన సునీత

రన్నింగ్, లాంగ్ జంప్‌లో సునీత ప్రతిభ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా లెవెల్లో రన్నింగ్, లాంగ్ జంప్‌లో మూలపేట జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని డిఎస్ సునీత ఉత్తమ ప్రతిభ కనబరించారు. ఆంధ్రప్రదేశ్ తరపున పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

విద్యుత్ పొదుపుపై గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాచరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బహుమతులు అందజేస్తామని ఆ శాఖ ఎఇ మాధురి తెలిపారు.

వినియోగదారుల వారోత్సవాల పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లోభాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక పిఎంశ్రీ మున్సిపల్ హైస్కూల్లో వినియోగదారుల ప్రయోజనం కోసం డిజిటల్ న్యాయం అనే అంశంపై వ్యాసరచన శుక్రవారం పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా సిహెచ్.రాజా వరహాలు, పి.బ్రహ్మానందం, జి.బేబీ రాణి వ్యవహరించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామ కృష్ణ పోటీలను పర్యవేక్షించారు.

ప్లీడర్ గుమస్తాల అధ్యక్షునిగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి-కాకినాడ

న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షునిగా అధ్యక్షులుగా ఎండూరి కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో పాధ్యక్ష పదవికి తప్ప మిగతా అన్ని పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కానేటి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా చెరిచెర్ల చిన్న అప్పారావు, కోశాధికారిగా ఐవి.రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాంపల్లి సత్య సూర్య ప్రకాష్ రావు వ్యవహరించారు.
వైస్ ప్రెసిడెంట్ పదవికి జరిగిన ఎన్నికలలో నమ్మాళం వెంకట రమణమూర్తి అలియాస్ రాజు గెలుపొందారు.



కార్మికులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో శుక్రవారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ వర్కర్స్ కోసం సేఫ్టీ ఫస్ట్ ఎయిడ్, వెల్ఫేర్ స్కీమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో సిబ్బంది ఫీల్డ్ స్థాయి సామర్థ్యాలను పెంచడం, ఉద్యోగంలో భద్రతను మెరుగుపరచడం, శానిటేషన్, వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కలిగినట్టు కమిషనర్ ఎ.శ్రీవిద్య చెప్పారు. ఈ శిక్షణను ట్రైనర్ బి.రామారావు నిర్వహిస్తూ వర్కర్లకు భద్రతా ప్రమాణాలు, సరైన శానిటేషన్ విధానాలు, రోజువారీ విధులపై విపులమైన, ప్రాయోగిక మార్గదర్శకతను అందించారు. కో ఆర్డినేటర్ సీతారామాంజనేయ రాజు, నోడల్ అధికారి రాజశేఖర్, శానిటేషన్ సెక్రెటరీస్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఖాతాదారులకు డిపాజిట్ సొమ్ము అందజేత

ప్రజాశక్తి - యానాం

చాలాకాలంగా క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, బీమా ఆదాయం, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్ బ్యాలెన్స్‌లు, పెన్షన్లను వాటి యజమానులకు, చట్టబద్ధమైన వారసులకు అందించే కార్యక్రమాన్ని ఆర్‌ఎఒ అంకిత్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసి సంస్థలు నుంచి సుమారు రూ.10 లక్షల చెక్కులకు సంభంధించి పత్రాలను ఖాతాదారులకు ఆర్‌ఎఒ సమక్షంలో అందజేశారు. ఈ శిబిరం డిసెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుందని అర్హత కలిగిన ఖాతాదారులు తమ బ్యాంకులను సంప్రదించి తమ క్లెయిమ్ చేయని డిపాజిట్లను పొందవచ్చని ఆర్‌ఎఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీస్, విశాఖపట్నం చీఫ్ మేనేజర్ సివిఎస్.నార్దన్, ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ టిఎల్ఎన్.పవన్ కుమార్ పాల్గొన్నారు.

21న వైఎస్ఆర్ స్మృతి మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - యానాం



వైఎస్ఆర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు

ఎపి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి యానాం ప్రాంతానికి చేసిన మేలును, అందించిన సహాయ సహకారాలు, తమ స్నేహానికి గుర్తుగా వైఎస్ఆర్ స్మృతి మందిరం, గోవుల నిలయాన్ని ఈ నెల 21న స్థానిక యర్రా గార్డెన్స్‌లోని తన స్వగృహం వద్ద ప్రారంభిస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం తన స్వగృహం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ నాటికి తన రాజకీయ అరంగేట్రం చేసి 36 ఏళ్ళయ్యిందని తన రాజకీయ జీవితంలో అత్యంత సన్నిహితులు, యానాం ప్రాంతానికి ఎంతో మేలు చేసిన డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకునేందుకు సొంత నిధులతో వైఎస్ఆర్ స్మృతి మందిరం, వైఎస్ఆర్ గోవుల నిలయాన్ని నిర్మించినట్టు తెలిపారు. తాను రచించిన 'ఆత్మీయులు రాజన్న స్మృతిలో' అనే పుస్తకం ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి భౌతికంగా దూరమై పదహారేళ్ల అయిందని కానీ ఆయన ఆలోచన విధానంలో నియోజకవర్గానికి చేసిన మేలు ఏదో ఒక రూపంలో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యానాంలో సాగు - తాగునీటి కొరత లేకుండా శాశ్వత పరిష్కారం చూపారన్నారు. వ్యవసాయ నీటిని 19 నుంచి 30 క్యూసెక్కులకు పెంచారన్నారు. మంచినీటి నిల్వలకోసం 52.5 ఎకరాల భూమిని యానాంకు కేటాయించారన్నారు. ధవళేశ్వరం పంప్ హౌస్ కట్టుకోవడానికి వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించారన్నారు. యానాం-ద్రాక్షారామ రోడ్డు యానాం ఆధీనంలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆయిల్ కంపెనీలు ఇచ్చే సిఎస్ఆర్ నిధులు ఆంధ్రకు 70 శాతం యానాంకు 30 శాతం నిధులు మంజూరు చేయడంలో సహకరించారని తెలిపారు. ఇలాంటివి ఎన్నో యానానికి చేశారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ చేసిన సేవలకు గుర్తుగా వైఎస్ఆర్ మంచినీటి పథకం, వైఎస్సార్ ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్, వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం, వైఎస్సార్ కాంస్య విగ్రహం, వైఎస్సార్ కాలనీ పేర్లు పెట్టినట్లు ఆయన తెలిపారు. యువతి యువకులకు మహిళలకు ఉపయోగపడేలా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను వైయస్సార్ స్మృతి మందిరంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

తాగునీటి కేంద్రంలో విగ్రహాలు సరికాదు

ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నగర పాలక సంస్థ తాగునీరు సరఫరా ప్రాంగణంలో నిర్మాణాలు తొలగించి వాజ్‌పాయ్ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం సమంజసం కాదని సిపిఎం నాయకులు అన్నారు. నగర కన్వీనర్ పలివెల వీరబాబు కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడారు. గతంలో మూడు లైట్ల సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బంది అని ఉన్న బస్ స్టాప్‌నే తొలగించారన్నారు. ఇప్పుడు అదే ప్రాంతంలో హడావిడిగా విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. పాలకవర్గం లేని సమయంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకుని నిర్ణయాలు చేయాల్సిన అధికారులు ఏకపక్షంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు బిజెపి నాయకులకు వంత పాడడం సమంజసంగా లేదన్నారు. నెల రోజుల క్రితం గాంధీ నగర్ పార్క్ దక్షిణం రోడ్‌లో మహ్మద్ ఆలీ మార్గ్ బోర్డు తొలగించిన ఘటనపై కూడా అధికారులు వైఖరి చిత్తశుద్ధిగా లేదన్నారు. ఈ సమావేశంలో మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, ఎం.హరనాథ్, జి.ప్రసాద్ ఉన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి గణిత పోటీలు

మామిడికుదురు : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు హైస్కూల్లో శుక్రవారం మండల స్థాయి గణిత పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీలలో 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి హెచ్‌ఎం.దొంగ సత్య నారాయణ వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోస్టర్ మేకింగ్ విభాగాలలో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ నెల 22న నిర్వహించే జాతీయ గణిత దినోత్సవంలో విజేతలకు నగదు బహుమతులు అంది స్తామని ఆయన అన్నారు. ప్రవాసా ంధ్రుడు నైనాల శ్రీనివాసరావు విద్యార్థులకు ప్రతి ఏటా రూ.20వేలు నగదు ప్రోత్సాహాలు అందిస్తున్నారని తెలిపారు.

కాకినాడ జిల్లాలో విలీనానికి జనసేన మద్దతు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకలు బహిరంగ లేఖ రాశారు. రామచంద్రపురం ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గానికి భౌగోళికంగా, పరిపాలనా పరంగా కాకినాడే అనుకూలమైన జిల్లా కేంద్రం అని తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ కాకినాడ జిల్లా కేంద్ర సాధన కోసం జనసేన పార్టీ తరపున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనిపైఅఖిలపక్ష జెఎసి నాయకులు మాట్లాడుతూ ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తమ డిమాండ్‌ను సిఎం, డిప్యూటి సిఎంలక తెలియజేయాలని కోరారు. చంద్రశేఖర్‌ను జెఎసి నాయకులు మాగాపు అమ్మిరాజు, బత్తుల సిద్ధు, దోమ్మలపాటి సత్యనారాయణ తదితరులు దుశ్శాలువా కప్పి సన్మానించారు.